సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం ׀ 15 ׀ సెప్టెంబర్ ׀ 2023



టీడీపీ నాయకురాలిపై చీటింగ్ కేసు

టీటీడీ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్‌లో కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయిస్తానని చెప్పి, వారి నుంచి రూ.20.50 లక్షలు వసూలు చేసిన టీడీపీ మహిళా నాయకురాలి గుట్టు రట్టయింది. - IIలో



దేశ భద్రతలో సీఆర్‌పీఎఫ్ కీలక పాత్ర

దేశ భద్రతలో సీఆర్‌పీఎఫ్ కీలక పాత్ర పోషిస్తోందని సీఆర్‌పీఎఫ్ ఐజీ ఏవైవీ క్రిష్ణ అన్నారు. గురువారం ఆయన కేంద్రం ఆవరణలోని క్వార్టర్ గార్డ్‌ని పరిశీలించారు. - IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.132
రెండోరకం	రూ.66	రూ.98

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 458 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	390	595
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 662.980 కిలోలు

న్యూస్‌రీల్

నేడు కేవీపల్లిలో 'జగనన్నకు చెబుదాం'

రాయచోటి : ప్రజల సమస్యలకు వేగవంతమైన పరిష్కారం కోసం మండల స్థాయిలో అన్ని శాఖల అధికారుల సమక్షంలో 'జగనన్నకు చెబుదాం'కార్యక్రమం వారంలో బుధవారం, శుక్రవారాల్లో ఉండబోతోందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 15న శుక్రవారం కేవీపల్లి మండలంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొనాలని కలెక్టర్ సూచించారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, మండల స్పెషల్ ఆఫీసర్లకు కార్యక్రమం గురించి సూచనలు చేశామని కలెక్టర్ తెలిపారు.

21న యువజనోత్సవాలు

రాయచోటి అర్బన్ : జిల్లాస్థాయి యువజనోత్సవాలను ఈనెల 21వ తేదీన రాజంపేటలో నిర్వహించనున్నట్లు అన్నమయ్య జిల్లా సెప్ అధికారిణి సాయిగ్రేస్ ఒక ప్రకటనలో తెలిపారు. 21న ఉదయం 9గంటలకు రాజంపేట ప్రభుత్వ డిగ్రీకళాశాలలో జరిగే ఉత్సవాల్లో 15 సంవత్సరాలు పూర్తయి 29 ఏళ్ల వయస్సు దాటని స్థానిక యువత పాల్గొనవచ్చునన్నారు. జానపదనృత్యం (గ్రూప్), (సోలో), జానపద గేయం (గ్రూప్) (సోలో) విభాగాల్లో, ఫొటోగ్రఫీ, పోస్టర్‌మేకింగ్, స్టోరీరైటింగ్ అంశాలలో పోటీలు ఉంటాయన్నారు.పోటీల్లో పాల్గొనదలచిన వారు ఈనెల 18వ తేదీలోగా వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9949298810, 8074305134 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వక్తృత్వ పోటీల్లో ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో అధ్యాపకులు

మదనపల్లె సిటీ : జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో గురువారం స్థానిక మహిళా డిగ్రీ కాలేజీలో జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలు నిర్వహించారు. నూతన జాతీయ విద్యా విధానం -2020, ఉన్నత విద్యక అనే అంశాలపై ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు ఉపన్యాసాలు ఇచ్చారని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి తెలిపారు. విజేతలుగా ఎస్‌పీఏ రిషిత (సంజయ్ గాంధీ డిగ్రీ కాలేజీ, పీలేరు), ఎ.ఎస్.హుస్సేన్ (ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, రాయచోటి), శశికళ (ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ, మదనపల్లె నిలిచారు. వీరికి జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు మోహన్‌బాబు, మోహన్‌వల్లి విష్ణుప్రియ, భవానీదేవి, జిల్లా వనరుల కేంద్ర సమన్వయకర్తలు విశ్వనాథ్, విజయలక్ష్మి, శైలజ, కవితలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో గురువారం నిర్వహించిన గెస్ట్ ఫ్యాకల్టీల ఇంటర్వ్యూలు ప్రశాంతంగా ముగిశాయి. బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మాటిక్స్, ఫైన్‌ఆర్ట్స్, ఫుడ్ టెక్నాలజీ కోర్సుల్లో గెస్ట్ ఫ్యాకల్టీ కోసం వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో నిపుణుల కమిటీ ఇంటర్వ్యూలను నిర్వహించింది. సైన్స్ విభాగం డీన్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, తిరుపతి ఎస్.వి.యూ కెమిస్ట్రీ ఆచార్యులు డా. ఎ.వి.ఎస్.రెడ్డి, ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆచార్యులు సర్దార్‌బేగ్, విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయం లలితకళల శాఖ సహాయ ఆచార్యులు డా. సింహాచలం తదితరులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అభ్యర్థుల బోధన నైపుణ్యాలను, విషయ పరిజ్ఞానాన్ని పరీక్షించారు.

21న సైన్స్ సెమినార్

రాయచోటి : అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి డైట్ కళాశాలలో ఈనెల 21వ తేదీన జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చిరుధాన్యాలు మంచి పోషకాహారం లేదా ఒక మంచి ఆహారం అనే అంశం పై సైన్స్ సెమినార్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాసైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రభుత్వ యజమాన్య పాఠశాలలో 8,9,10వ తరగతులు చదువుతున్న విద్యార్థులు ఇందులో పాల్గొనడానికి అర్హులన్నారు. ఒక పాఠశాల నుంచి ఒకరు మాత్రమే పాల్గొనాలన్నారు. ప్రదర్శనలో శాస్త్రీయ విషయాలు, ప్రసంగంలో పటిమ, ప్రశ్నలకు సమాధానమివ్వగల సామర్థ్యం, విజువల్స్ వాడకంలో కొత్తదనం తదితర అంశాలను పరీక్షిస్తారని తెలిపారు. సెమినార్ ప్రారంభమయ్యే ముందు పాల్గొనే వారందరికీ రాతపూర్వక ఆప్టిట్యూడ్ టెస్టు కూడా ఉంటుందన్నారు. ప్రదర్శన సమయంలో 3డీ మోడల్స్, వీడియోలు ప్రదర్శించడానికి అనుమతి లేదన్నారు.

మురిపించన్

- జిల్లా వ్యాప్తంగా 13,504 మందికి కొత్త పెన్షన్
- అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా ప్రభుత్వ చర్యలు
- ప్రభుత్వ తీరును స్వాగతిస్తున్న పింఛన్‌దారులు



పీలేరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

సాక్షి రాయచోటి : రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరిస్తోంది. అర్హులందరికీ అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. పండుటాకులకు ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఏడాది పెన్షన్ సొమ్ములను ముఖ్యమంత్రి పెంచుతూ వెళుతున్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోంది. అన్నమయ్య జిల్లాలో పెన్షన్లకు సంబంధించి ప్రతినెల సుమారు రూ. 62.49 కోట్లకు పైగా సొమ్ములు చెల్లిస్తోంది. ప్రస్తుతం జిల్లాలో 2,26,511 మంది ఉండగా, కొత్తగా ప్రభుత్వం మరో 13,504 మందికి శుభవార్త చెప్పింది. చవితి పండుగకు ముందే పెన్షన్లు మంజూరు చేయడంతో వినాయక చవితి పండుగ ముందుగానే వచ్చిందని పెన్షన్ దారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా సుమారు 2,26,511 పండుటాకులు, వితంతు, చేనేత, దివ్యాంగులకు పింఛన్లు అందిస్తూ వస్తున్నారు.కోట్లాది రూపాయలు ప్రతి నెల ఒకటో తేదీన కోడికూత కూయగానే వలంటీర్లు తలుపుతట్టి మరీ లబ్ధిదారుని చేతికి అందిస్తున్నారు.

కొత్త పెన్షన్‌దారులకు చవితి పండుగ

జిల్లాలోని కొత్త పెన్షన్ దారులకు వినాయక చవితి పండుగ ముందే వచ్చినట్లయింది. జిల్లా వ్యాప్తంగా మొదటి విడత(సెప్టెంబరు 1 నాటికి) 5947, రెండో విడత (సెప్టెంబరు 8వ తేదికి)లో 7557 కలిపి మొత్తం 13,504 పెన్షన్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు అందాయి. రెండు విడతలకు సంబంధించి కూడా ఇప్పటికే పెన్షన్ మొత్తాన్ని కూడా దాదాపుగా పంపిణీ చేశారు. సాధారణంగా 5వ తేదీ నాటికి ప్రతి నెల పింఛన్ల మొత్తాన్ని పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఈసారి రెండో విడతలో కూడా పింఛన్లు మంజూరుకావడంతో సెప్టెంబరు 15 వరకు సమయం ఇచ్చి అందరికీ డబ్బు అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. కొత్త పెన్షన్ల ద్వారా ప్రభుత్వంపై అదనపు భారం పడుతున్నా అర్హులందరికీ అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం అడుగులు ముందుకు వేసింది.

చాలా సంతోషంగా ఉంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు పెన్షన్ అందుతుంది. ఈ ప్రభుత్వంలో మాలాంటి వారికి న్యాయం జరుగుతుంది. పెన్షన్ అందడం సంతోషంగా ఉంది. నాకు రెండు మగ్గాలు ఉండగా, ఈనెల రూ. 3000 పింఛన్ అందుకున్నాను. **- చలపతి, చేనేత కార్మికుడు, మాదవవాండ్లపల్లె,సంబేపల్లె మండలం**

జగనన్నకు రుణపడి ఉంటాం



నాకు వృద్ధాప్య పెన్షన్ మంజూరైంది. ఈ ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే డబ్బు అందించడం ఆనందదాయకం. గతంలో పింఛన్ కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగాల్సి వచ్చేది. ప్రస్తుతం వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి దరఖాస్తు స్వీకరించి పెన్షన్ మంజూరు చేయించారు. జగనన్నకు రుణపడి ఉంటాం. **- చింపిరి రోజమ్మ, చౌటపల్లె, లక్కిరెడ్డిపల్లి మండలం**

అర్హులందరికీ పింఛన్లు



ప్రభుత్వం జిల్లాలో ప్రతినెల 1వ తేదీనే వలంటీర్ల ద్వారా ఇంటింటికి పెన్షన్ సొమ్ము పంపిణీ చేస్తున్నారు. ఈనెలలో రెండు విడతల్లో అర్హులకు మంజూరు ఉత్తర్వులు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం పింఛన్‌దారులకు చెప్పిన ప్రకారం సొమ్ము పెంచడం మొదలుకొని అర్హత ఆధారంగా డబ్బు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. **- పీఎస్ గిరీషా, జిల్లా కలెక్టర్**

జిల్లాకు సంబంధించి సెప్టెంబరు నెలలో పెరిగిన పెన్షన్లు

మండలం	మొదటి విడత	రెండో విడత	మొత్తం
బి.కొత్తకోట	209	308	517
చిన్నమండెం	116	160	276
చిట్వేలి	146	187	333
గాలివీడు	139	179	318
గుర్రంకొండ	151	195	346
కలకడ	171	155	326
కలికిరి	198	230	428
కంభంవారిపల్లె	187	202	389
కోడూరు	303	362	665
కురబలకోట	168	252	420
లక్కిరెడ్డిపల్లి	114	140	254
మదనపల్లి(టౌన్)	426	479	905
మదనపల్లి	362	591	953
ములకలచెరువు	206	200	406
నందలూరు	118	128	246
నిమ్మనపల్లి	142	139	281
ఓబులవారిపల్లి	162	195	357
పెద్దమండెం	136	205	341
పెద్దతిప్పసముద్రం	230	322	552
పెనగలూరు	142	237	379
పీలేరు	246	252	498
పుల్లంపేట	129	140	269
రాజంపేట	193	220	413
రాజంపేట(టౌన్)	96	124	220
రామాపురం	122	202	324
రామసముద్రం	181	241	422
రాయచోటి	106	142	248
రాయచోటి(టౌన్)	212	280	492
సంబేపల్లె	138	225	363
టి.సుండుపల్లి	208	251	459
తంబళ్లపల్లి	182	237	419
వాయల్పాడు	190	229	419
వీరబల్లి	118	148	266
	5947	7557	13504

ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు

– ప్రజలకు జిల్లా ఎస్పీ పిలుపు



మాట్లాడుతున్న ఎస్పీ బి. కృష్ణారావు

పీలేరురూరల్ : ఈ నెల 18 నుంచి నిర్వహించనున్న గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయాన్ని ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాత్రి సమయాల్లో గస్తీ పెంచాలని సిబ్బందికి సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గణేష్ నిమజ్జనం, ఊరేగింపు సందర్భంగా హద్దులు మీరి ప్రవర్తించరాదని తెలిపారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా గణేష్ ఊరేగింపు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మహబూబ్‌బాషా, సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ రమణ పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై నిఘా పెట్టాలి

కలకడ : జిల్లాలో అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టాలని జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు పోలీసు అధికారుల ఆదేశించారు. గురువారం కలకడ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. రానున్న ఎన్నికల దృష్ట్యా జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బాలికలు, మహిళలకు ప్రత్యేక స్థానం కల్పించి వారి నుంచి అందే ఫిర్యాదు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మండల సరిహద్దుల్లో అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా మ్యాప్‌తోపాటు, పోలీస్ స్టేషన్ పరిధిలో అటవీప్రాంతం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.అనంతరం రికార్డులను పరిశీలించారు. కలకడ సీఐ నాగేంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కురులు.. కురిపించె సిరులు

- సంతాన దేవతకు తలనీలాలే ఆస్తి
- రెడ్డెమ్మ కొండ నుంచి
- విదేశాల్లో భలే డిమాండ్
- రికార్డు స్థాయిలో వేలం పాట







చెర్లోపల్లెలో వెలసిన సంతానదేవత శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయం, తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

కడప డెస్క్ : తల నీలాలు అనగానే తిరుమల కల్యాణ కట్ట గుర్తుకు వస్తుంది. తిరుమల వెళ్లిన భక్తుల్లో పిల్లలు, పెద్దలు, వృద్ధులు.. ఇలా దాదాపు 80 శాతం మంది తలనీలాలు సమర్పిస్తారు. తిరుమల తర్వాత తలనీలాలకు అంత ప్రాధాన్యం గల ఆలయం అన్నమయ్య జిల్లాలోని రెడ్డెమ్మకొండ. ఇక్కడ యువత... అదీ ఎక్కువగా వివాహితలు తమ తల నీలాలు సమర్పిస్తారు. సంతాన దేవతగా ప్రసిద్ధి పొందిన ఈ అమ్మవారికి వివాహితలు తమ తలనీలాలు సమర్పించి దర్శించుకుంటే సంతాన ప్రాప్తి కలుగుతుందని నమ్మకం. అలాగే తమ కోరిక తీరిన తర్వాత కూడా తలనీలాలు సమర్పిస్తారు.

సంతాన దేవతగా ప్రసిద్ధి

అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం చెర్లోపల్లి గ్రామంలో రెడ్డెమ్మకొండ ఆలయం ఉంది. రాయచోటి-మదనపల్లి జాతీయ రహదారిలోని పెద్దాలవారి పల్లి వద్ద దిగి కిలోమీటరు వెళ్తే ఈ ప్రసిద్ధ ఆలయం కనిపిస్తుంది. రాష్ట్రంలో ఇతర దేవాలయాలతో పోల్చితే రెడ్డెమ్మ కొండ ఆలయానికి ప్రత్యేకత ఉంది. ఇక్కడికి వచ్చే భక్తులలో సంతానం కోసం వచ్చే వారే అధికం. పైగా అందరూ 45 సంవత్సరాల వయస్సు లోపు మహిళలే. ఇక్కడి ఆలయ పరిసరాల్లో తల నీలాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకుంటే సంతానం కలుగుతుందని వారి నమ్మకం. అందుకే భారీ సంఖ్యలో వివాహితలు వచ్చి దర్శించుకుని ఇక్కడ పంపిణీ చేసే ఆకు పసరు తాగి అమ్మవారి ఎదుట సాష్టాంగ నమస్కారం చేస్తారు. తమ కోర్కెలు తీరిన తర్వాత మహిళలతో పాటు వారి కుటుంబ సభ్యులు అమ్మవారికి తలనీలాలు సమర్పిస్తుంటారు.

తలనీలాలకు చైనాలో డిమాండ్

రెడ్డెమ్మ ఆలయానికి వచ్చే వారిలో యుక్త వయస్సు వారే అధికం. వీరు సమర్పించే తలనీలాలు ఎంతో నాణ్యమైనవిగా ఉండడంతో విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడి నుంచి చైనాతోపాటు ఇతర దేశాలకు తలానీలాలను ఎగుమతి చేస్తుంటారు. రాష్ట్ర స్థాయిలో రెడ్డెమ్మతల్లి ఆలయంలో భక్తులు సమర్పించే ఈ తలనీలాలకు మొదటి స్థానం ఉంది. విదేశాల్లోనూ ఎక్కువ ధర లభించడమే కారణం.

కిలో తలనీలాలు రూ. 60 వేలు

ప్రస్తుతం కిలో తలనీలాల ధర మార్కెట్లో రూ. 60 వేల వరకు పలుకుతోంది. గతంలో కిలో ధర రూ. 30 వేల నుంచి రూ. 40వేల వరకు మాత్రమే ఉండేది. అయితే మార్కెట్లో ఉన్న డిమాండ్ దృష్ట్యా విదేశాల్లోనూ ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి.

రికార్డుస్థాయిలో వేలం పాట

నాణ్యమైన తలనీలాల కోసం పోటీ పెరగడంతో ఆలయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది తలనీలాల వేలం పాట రికార్డు సృష్టించింది. కర్ణాటక తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలతోపాటు రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, కర్నూలు, అనంతపురం, కృష్ణా జిల్లాల నుంచి పెద్దఎత్తున వ్యాపారులు తరలి రావడంతో పోటీ పెరిగింది. వేలం దక్కించుకోవాలనే ఉద్దేశంతో రికార్డు స్థాయిలో రూ.27.01 లక్షలకు వరకు పాడుకున్నారు. గతంలో రూ. 10 నుంచి రూ. 12 లక్షలు దక్కగా రెండేళ్లలో అమాంతం పెరిగి గత ఏడాది రూ.26.34 లక్షలు, ప్రస్తుతం రూ.27.01 లక్షలకు పాట ముగియడం విశేషం. విదేశాల్లో రెడ్డెమ్మకొండ తలనీలాలకు ఉన్న డిమాండే దీనికి కారణమని వ్యాపారులు చర్చించుకోవడం గమనార్హం.

తలనీలాలకు మంచి డిమాండ్



అమ్మవారి ఆలయంలో భక్తులు సమర్పించే తలనీలాలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. నాలుగు రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు పాల్గొనడం ఇందుకు నిదర్శనం. దేశంలోనేగాక, విదేశాల్లోనూ రెడ్డెమ్మకొండ తలనీలాలకు మంచి డిమాండ్ ఉంది. అందుకోసమే వ్యాపారులు పెద్ద మొత్తంలో దక్కించుకున్నారు. **- నరసింహారెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్, చెర్లోపల్లె**

అధిక మొత్తంలో పాడుకొన్నారు



ఈ ఏడాది తలనీలాలకు ఎక్కువ మొత్తంలో వేలంపాట పాడుకొన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా వ్యాపారులు పోటీపడి వేలంలో పాల్గొన్నారు. అమ్మవారి దయతో రికార్డు స్థాయిలో రూ. 27.01 లక్షలకు తలనీలాల కాంట్రాక్టు తీసుకొన్నారు. ఆలయ అభివృద్ధికి ఇది దోహద పడుతుంది. **- మంజుల, శ్రీరెడ్డెమ్మకొండ ఈవో, చెర్లోపల్లె**

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

శ్రీ భారతీయ విద్యా భవన్
ఇంగ్లీష్ మీడియం స్కూల్, విద్యాభవన్ రోడ్,
ప్రశాంత్ నగర్, కొత్తపేట, రామాపురం,
రాయచోటి - 516269, అన్నమయ్య జిల్లా.

తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి
మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 90101 24073

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ : శ్రావణ పౌర్ణమి పురస్కరించుకుని ఈనెల 28న అరుణాచలంకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ–2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. 28 ఉదయం 9 గంటలకు ఆరు బస్సులు బయలుదేరుతాయన్నారు. ప్రయాణికులు ముందుగా టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకోవాలని ఆయన చెప్పారు. మరిన్ని వివరాలకు 9959225677, 9160186645ను సంప్రదించాలన్నారు.

ఈవీఎంల స్కానింగ్ ప్రక్రియ పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : జిల్లా కేంద్రానికి చేరిన ఈవీఎంలను స్థానిక గోడౌన్‌లో భద్రపరిచారు. ఈనెల 15వ తేదీ సాయంత్రంలోగా వీటి స్కానింగ్ ప్రక్రియను ఈనెల 15 కల్లా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న ఈవీఎం గోడౌన్‌లో ఈవీఎంల స్కానింగ్ ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎలక్షన్ కమిషన్ నుంచి అన్నమయ్య జిల్లాకు ఎన్ని ఈవీఎంలు వచ్చాయి.. ఎన్నింటిని స్కానింగ్ చేశారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలకు సంబంధించి వీవీ ప్యాట్‌లు 4850 ,బీయూలు 4440, సీయూలు 3950, వచ్చినట్లు రెవెన్యూ సిబ్బంది వివరించారు. ఇందులో ఇప్పటి వరకు 1330 వివి ప్యాట్‌లు, 2048 బియూలు, 3503 సీయూ యూనిట్లను స్కానింగ్ చేసినట్లు తెలిపారు. నేటి సాయంత్రంలోగా ఈవీఎం యూనిట్లన్నింటినీ స్కాన్‌చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం గోడౌన్‌లో ఉన్న బీయూ, సీయూ యూనిట్లను,వాటి స్కానింగ్ విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు.

- డీఆర్‌ఓ కలెక్టర్, జేసీ, డీఆర్‌ఓ బంగ్లాల నిర్మాణ స్థలం చదును, భూమి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం దీనికి సంబంధించిన పనులన కలెక్టర్ పరిశీలించారు. నిపుణులైన ఆర్కిటెక్చర్‌ను పిలిపించి సదరు స్థలాన్ని పరిశీలించి బంగ్లాల నిర్మాణం మ్యాపులు రూపొందించాలని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

రాయచోటిటౌన్ : పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో డాక్టర్ అబ్దుల్ కలాం యువ కెరటం ట్రస్టు ఆధ్వర్యంలో మట్టిగణపతిని ప్రతిష్టిద్దాం -పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదంతో పోస్టర్లను విడుదల చేశారు. మట్టితో తయారు చేసిన విగ్రహాలు పెట్టడం వల్ల నిమజ్జన సమయంలో వాతావరణం కాలుష్యం తగ్గుతుందన్నారు.జేసీ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ , ట్రస్టు డైరెక్టర్ వినయ్‌కుమార్,సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలయ్య, దత్తపుత్రుడు ఒకటైనా ఒరిగేదేమీలేదు



మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట : దత్తపుత్రుడు, బాలయ్య ఒకటైనా ఒరిగేదేమీ లేదని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ అనుభవం పేరుచెప్పుకొని రాజకీయాలు చేసుకొని చంద్రబాబు ఏమీ చేయలేకపోయాడని ఎద్దేవా చేశారు. అడ్డగోలుగా మోసాలకు పాల్పడి జైలు పాలయ్యారన్నారు. ఆయన అరెస్టును ప్రజలెవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇందుకు ఉదాహరణే బంద్ విఫలమేనన్నారు. బాలయ్య రాకతో నారా రాజకీయానికి చరమగీతం పాడినట్లేనన్నారు. టీడీపీకి ఇప్పుడు నాయకుడు ఎవరో తెలియదని, పవన్, బాలయ్య, లోకేష్ అనేది సందిగ్ధంలో పడవేసిందన్నారు. నారా నాయకత్వంపై ప్రజల్లో నమ్మకం పోయిందన్నారు. మరోసారి తన రాజకీయ జీవితాన్ని ప్యాకేజీ కోసం పణంగా పెట్టుబోతున్నాడు దత్తపుత్రుడు అని ఎద్దేవా చేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

నిమ్మనపల్లె : అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని బాహుదా పరీవాహక ప్రాంతం నుంచి ట్రాక్టర్‌లో ఇసుక లోడ్ చేసుకుని దిగువపల్లె వైపు వెళుతుండగా.. ట్రాక్టర్, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఇసుక తరలింపునకు అనుమతులు లేకపోవడంతో వాల్మీకిపురం మండలానికి చెందిన ట్రాక్టర్ యజమాని సురేష్, డ్రైవర్ శేఖర్‌లపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

మహిళ కడుపులో కణితి తొలగింపు



ఆపరేషన్ నిర్వహిస్తున్న వైద్యుల బృందం

మదనపల్లె : ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో మహిళ కడుపులో ఉన్న ఐదు కిలోల కణితిని తొలగించారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలిదేవి గురువారం మీడియాకు వివరాలు వెల్లడించారు. పీటీఎం మండలం పోతుపేట పంచాయతీ పిడిమివారిపల్లెకు చెందిన వ్యవసాయ కూలీ మధు భార్య అనిత(33) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతుండేది. కడుపు పరిమాణం రోజు రోజుకు పెరుగుతుండటంతో మదనపల్లెలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించింది. అక్కడి వైద్యులు కడుపులో కణితి ఉందని, ఆపరేషన్ చేసి తొలగించాలని రూ.50 వేల వరకు ఖర్చవుతుందని చెప్పారు. అంత ఆర్థిక భారం మోయలేమని భావించిన వారు వారం క్రితం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు ఆమెకు పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ ఆస్పత్రి సివిల్ సర్జన్ డాక్టర్ హరగోపాల్, రామాంజులునాయక్, అనస్థీషియన్ వైద్యులు కిరణ్మయి, అభిషేక్, రమేష్ తదితరులు బృందంగా ఏర్పడి ఆమెకు ఆపరేషన్ చేసి 5 కిలోల కణితిని తొలగించారు. ప్రస్తుతం అనిత ఆరోగ్యం కుదురుగానే ఉందని, ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు సూపరింటెండెంట్ పద్మావతి తెలిపారు. ఆపరేషన్ విజయవంతంగా చేయడంపై అనిత కుటుంబ సభ్యులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ మహిళా నాయకురాలిపై చీటింగ్ కేసు

- టీటీడీలో ఉద్యోగాల పేరుతో రూ.20.50 లక్షల వసూళ్లు
- బాధితులు నిలదీయడంతో వారిపైనే ఎదురుదాడి
- టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

మదనపల్లె : టీటీడీ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్‌లో కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయిస్తానని చెప్పి, వారి వద్ద నుంచి రూ.20.50 లక్షలు వసూలు చేసిన టీడీపీ మహిళా నాయకురాలి గుట్టు రట్టయింది. తిరుపతికి చెందిన పలువురు టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగులు మదనపల్లె పట్టణం ప్రశాంత్‌నగర్‌కు చెందిన శనివారపులలిత అలియాస్ స్నేహలతారెడ్డి తమను మోసం చేసిందంటూ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి గిరిపురానికి చెందిన కామసాని నవీన్‌కుమార్(36) కాంట్రాక్ట్ బేసిక్‌లో టీటీడీ ట్రాన్స్‌పోర్ట్‌లో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. అదే విభాగంలో పర్మినెంట్ ఉద్యోగి అయిన ఎస్.పద్మావతమ్మ వద్దకు మదనపల్లె ప్రశాంత్‌నగర్‌కు చెందిన శనివారపు లలిత అలియాస్ స్నేహలతారెడ్డి తరచూ వచ్చి వెళుతుండేది. ఈ క్రమంలో పద్మావతమ్మ తన స్నేహితురాలైన స్నేహలతారెడ్డికి తనతోపాటుగా టీటీడీ ట్రాన్స్‌పోర్ట్‌లో కాంట్రాక్ట్ బేసిక్ మీద పని చేస్తున్న శ్రీనివాసులు, సురేష్‌బాబు, గిరిబాబు, శరవణకుమార్, పి.సోమశేఖర్, కోటేశ్వరరావు, ఏ.వి. బాలసుబ్రహ్మణ్యం, తులసీప్రసాద్, డి.మునిశంకర్, మల్లికార్జునలను పరిచయం చేసింది. స్నేహలతారెడ్డి తనకు ప్రభుత్వంలోని ఉన్నత స్థాయి వారితో పరిచయాలు ఉన్నాయని నమ్మబలికింది. అందరూ కలిసి రూ.20.50 లక్షలు ఇస్తే మీ కాంట్రాక్ట్ బేసిక్ ఉద్యోగాలను పర్మినెంట్ చేయిస్తానని, మాయమాటలు చెప్పి నమ్మించింది. దీంతో 41 మంది ఒక్కొక్కరు రూ.50,000 చొప్పున రూ.20.50 లక్షలు వసూలు చేసి మదనపల్లెలో ఆమె ఇంటి వద్దకు వెళ్లి ఇచ్చారు. డబ్బులు తీసుకున్నట్లుగా చెక్కులు, ప్రాంసరీనోటు, రూ.100 స్టాంప్ పేపర్‌పై సంతకాలు చేసి ఇచ్చింది. ఆమెకు డబ్బులు ఇచ్చేటప్పుడు సాక్ష్యంగా ఫొటోలు తీసుకున్నారు. రోజులు గడుస్తున్నప్పటికీ ఉద్యోగాలను పర్మినెంట్ చేయించకపోవడంతో అనుమానం వచ్చి డబ్బులను తిరిగి ఇవ్వాల్సిందిగా కోరారు. దీంతో ఆమె తన కొడుకు పురుషోత్తంరెడ్డి, మరికొందరు రౌడీలతో కలిసి తమపై దాడులు చేయించడమే కాకుండా డబ్బులు ఇచ్చేది లేదని, అవసరమైతే అందర్నీ చంపేస్తామని బెదిరించిందని బాధితులు వాపోయారు. దీంతో అక్కడి నుంచి తప్పించుకుని పారిపోయి వచ్చిన తాము... స్నేహలతారెడ్డి ఉద్దేశ పూర్వకంగానే పథకం ప్రకారం తమను మోసం చేసినట్లు గ్రహించామన్నారు. ఆమెకు ప్రభుత్వ అధికారులతో కానీ, ప్రభుత్వంతో ఎటువంటి సంబంధాలు లేవని, ముఖ్యమంత్రి, సెక్రటేరియట్ అధికారుల పేర్లు వాడుకుంటూ మోసాలకు పాల్పడుతోందని తెలుసుకుని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై టూటౌన్ సీఐ మహబూబ్‌బాషా మాట్లాడుతూ.. బాధితుల ఫిర్యాదు మేరకు శనివారపు లలిత అలియాస్ స్నేహలతారెడ్డిపై క్రైమ్‌నెంబర్.151/2023 కింద 420, 419, 406, 506 సెక్షన్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న స్నేహలతారెడ్డి(అద్దాలు పెట్టుకున్న మహిళ)

బస్సు, స్కూటీ ఢీకొని ఒకరి మృతి



మృతి చెందిన సమీరుద్దీన్

రాజంపేట : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లో గురువారం పులివెందుల డిపోకు చెందిన బస్సు, స్కూటీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో స్కూటీపై ఉన్న సమీరుద్దీన్ (65), శ్రీకాంత్ తీవ్రంగా గాపడ్డారు. వీరిని రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సమీరుద్దీన్‌ను రిమ్స్‌కు తరలించే క్రమంలో మృతి చెందారు. మన్నూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ సంపదను కాపాడే విషయంలో వెనకడుగు వేయం

జిల్లా అటవీశాఖ అధికారి వివేక్ ఐఎఫ్ఎస్



రాజంపేట టౌన్ : అటవీ సంపదను కాపాడే విషయంలో దాడులు వంటి సంఘటనలకు భయపడి వెనకడుగు వేసే ప్రసక్తే లేదని జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్ ఐఎఫ్ఎస్ స్పష్టం చేశారు. ఈనెల 13వ తేదీ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో గిరిజన సమాఖ్య నాయకులు శంకర్‌నాయక్ , విశ్వనాథ్‌నాయక్‌ల తోపాటు మరికొంత మంది మహిళలను అడ్డుపెట్టుకొని తనపై దాడికి యత్నించినట్లు ఆయన గురువారం రాజంపేటలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ భూ సమస్యలపై కలెక్టర్ నిర్వహించిన సమావేశానికి తాను వెళుతుండగా కలెక్టరేట్‌లోనే తనపై దాడి యత్నం జరగడం తనను ఎంతగానో కలచి వేస్తుందన్నారు. కొంత మంది తనను చుట్టుముట్టి పథకం ప్రకారం దాడి చేసేందుకు ప్రయత్నించారని, అయితే తన అటెండర్, డ్రైవర్, బీట్ ఆఫీసర్‌లు వారిని అడ్డుకొని తాను కలెక్టర్ చాంబర్‌కు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేశారని తెలిపారు. సానిపాయి అటవీ రేంజ్ పరిధిలోని షికారువారిపాళెంలో వద్ద ఉండేది అటవీ భూములన్నారు. అయితే కొంత మంది నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఆర్‌ఓఫార్ పట్టా ఇవ్వాలని అడుగుతున్నట్లు తెలిపారు. అయితే ఆ భూమి అటవీశాఖకు చెందినది అయినందున తాము ఆర్‌ఓఫార్ పట్టా ఇవ్వబోమని, వారిద్వారా వచ్చిన ఫైల్‌ను గత నెలలో తాను తిరస్కరించినట్లు పేర్కొన్నారు.

దాడి అమానుషం

కడప అర్బన్ : అన్నమయ్య జిల్లా అటవీశాఖ అధికారి వివేక్‌పై కొంత మంది దాడి చేయడాన్ని ఏపీ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ కడప యూనిట్ వారు తీవ్రంగా ఖండించారు. గురువారం సాయంత్రం కడపలోని పంచవటి ఫారెస్ట్ అతిథి గృహంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ టి. నాగరాజు, సెక్రటరీ ఎస్.శ్రీనివాసులు మాట్లాడారు. సమావేశంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌లు రాజు, ఎస్.రాజశేఖర్‌రాజు, ట్రెజరర్ ఏ.విశ్వనాథ్ పాల్గొన్నారు.

గిరిజన సమాఖ్య నాయకుల అరెస్టు

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి విధులలో భాగంగా అటవీ శాఖ అధికారి (డీఎఫ్ఓ) వివేక్ వచ్చారు. అక్కడే తమ పొలాలకు పట్టాలు ఇవ్వాలంటూ నిరసన కార్యక్రమాలు చేపడుతున్న గిరిజన సమాఖ్య నాయకులు ఆయనను అడ్డుకున్నారు. ఆయన లోపలికి వెళ్లేందుకు ససేమిరా అంటూ అడ్డుకున్నారు. వీరబల్లి మండలం తాటిగుంటపల్లె సమీపంలోని షికారు పాలెం గిరిజనులకు సాగు చేసుకొనేందుకు భూమి ఇవ్వాలని, వాటికి సంబంధించిన పట్టాలు కూడా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గత కొద్ది రోజులుగా జిల్లా కార్యాలయం ఎదుట గిరిజన సమాఖ్య నాయకులు విశ్వనాథనాయక్, శంకర నాయక్‌లు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో డీఎఫ్‌వో జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వస్తున్న సమయంలో వీరు అడ్డుకోవడంతోపాటు లోపలికి వెళ్లనీయకుండా అడ్డుకొంటూ తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అటకాయించారు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి వీరిని గురువారం అదుపులోకి తీసుకొని వీరిపై ఐపీసీ సెక్షన్ 353 కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



డీఎఫ్ఓ వివేక్‌తో వాదిస్తున్న గిరిజన సమాఖ్య నాయకులు

పేదలకు భూములు పంపిణీ చేయాలంటే కేసులా?

రాయచోటి అర్బన్ : నిరుపేదల గిరిజనులకు చట్టపరంగా అటవీ భూములను పట్టాలుగా ఇవ్వాలంటూ అడిగినందుకు గిరిజన సమాఖ్య నేతలపై కేసులు నమోదు చేసి జైలుకు పంపడం తగదని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.యల్.నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్‌లు అన్నారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చిత్రపటం వద్ద ఆయన ప్రజాసంఘాల నేతలతో కలసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షికారుపాళెం గిరిజనులకు భూములను పట్టాలుగా ఇవ్వాలంటూ గిరిజన సమాఖ్య నేతలు విశ్వనాథనాయక్, శంకర్‌నాయక్ తదితరులు బుధవారం కలెక్టరేట్ వద్ద రాజంపేట డీఎఫ్ఓ వివేక్‌ను గట్టిగా అడగడం జరిగిందన్నారు. కాగా గిరిజన సమాఖ్యనేతలు తన చేయి పట్టుకున్నారని, తనపై దౌర్జన్యం చేశారంటూ అక్రమంగా కేసులు పెట్టడం ఎంత వరకు విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా గిరిజన నేతలపై బనాయించిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలంటూ వారు డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రజాసంఘాల నేతలు పి.రెడ్డెయ్య, ఎం.రవిశంకర్, సాంబశివ, మండెం సుధీర్‌కుమార్, రంగారెడ్డి, మహేష్, గిరిజన సమాఖ్య జిల్లా నేతలు రెడ్డిశేఖర్, ఆంజనేయులు, నరసింహ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అవ్వ కష్టం తీరింది.. ఇంటికి చేరింది



సోమల మండలం ఆవులపల్లెలో నవ్వుతున్న వెంకటలక్ష్మమ్మ

కురబలకోట : ఎట్టకేలకు అవ్వ కష్టం తీరింది.. ఇంటికి చేరింది. 'ఆ అవ్వే మరణిస్తే.. ఆ పాపం ఎవ్వరిది..!' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో గురువారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనాన్ని చూసిన కుటుంబ సభ్యులు ఆమెను ఇంటికి తీసుకెళ్లారు. ఈమె పేరు వెంకటలక్ష్మమ్మ. సోమల మండలంలోని ఆవులపల్లె. వీరిది వ్యవసాయ కుటుంబం. ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈమె పద్మావతమ్మ అనే పెద్ద కుమార్తె వద్ద ఉంటోంది. చేతిపై ఉన్న అలివేలమ్మ అనే పచ్చబొట్టు ఈమె అక్క పేరు. అక్కపై ఇష్టంతో ఆమె పేరును వేయించుకుంది. వయసులో ఉన్నప్పుడు కుటుంబం కోసం ఎంతగానో కాయకష్టం చేసింది. నా ఇల్లు, నా వాళ్లని కుటుంబాన్ని నెత్తిన పెట్టుకుని మోసింది. ఇలాంటి ఆమె రాయచోటిలో ఉన్న చిన్న కుమార్తె వద్దకు బయలుదేరింది. సోమలలో రాయచోటి బస్సు ఎక్కాల్సి ఉంది. బస్సుపై ఉన్న పేరు గుర్తుపట్టలేదు. ఎవరినైనా అడగడానికి నోటి మాట సరిగా రాదు. దీంతో పొరపాటున కలకడ బస్సు ఎక్కింది. ఆ బస్సు కలకడ వరకే లాస్ట్ స్టాఫ్ కావడంతో.. బస్సు దిగి అక్కడ నుంచి ఎటు వెళ్లాలో తెలియక నడక ప్రయాణం చేయసాగింది. పది రోజులుగా కష్టాలు అనుభవించింది. ఈమె దీన పరిస్థితిని చూసి స్థానికులు ఓదార్చారు. ఆహారం ఇచ్చి ఆదుకున్నారు. ఈమె ఫొటోతో గురువారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఆమెను గుర్తుపట్టిన కుటుంబ సభ్యులు వచ్చి తీసుకెళ్లారు. ఎట్టకేలకు ఇంటికి చేరడంతో ఆమెకు సాంత్వన లభించింది. బతుకు జీవుడా అంటూ ఊపిరి పీల్చుకుంది. ఇన్నాళ్లు పడ్డ కష్టాన్ని మరిచింది. ఈమె కోసం కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతోపాటు వివిధ చోట్ల వెతికారు. తప్పిపోయిన అమ్మ ఎట్టకేలకు దొరకడంతో.. కుమార్తెలు, కుమారులు, బంధుమిత్రులు ఆనందం వ్యక్తం చేశారు.

ఇద్దరు మహిళల అదృశ్యం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళలు అదృశ్యం కావడంపై కేసులు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ మహబూబ్ బాషా తెలిపారు. పట్టణంలోని వడ్డిపల్లెకు చెందిన వెంకటరమణ భార్య ఉప్పుతోళ్ల శోభ(33) నెలన్నర క్రితం ఇంట్లో చెప్పకుండా వెళ్లి కనిపించకుండా పోయింది. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. గురువారం శోభ తల్లి రమణమ్మ కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు చేసింది. అదే విధంగా వీరబల్లి గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి ఇస్మాయిల్ భార్య కందూరు హుస్నా(30) ఈనెల 12న మదనపల్లె పట్టణంలో శుభకార్యానికి వెళుతున్నానంటూ ఆటో బాడుగను మాట్లాడుకుని వచ్చింది. పట్టణంలోని ఎన్‌టీఆర్ సర్కిల్‌లో ఆటో దిగి, తర్వాత కనిపించకుండా అదృశ్యమైంది. ఈ విషయమై ఆమె భర్త ఇస్మాయిల్ గురువారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెండు ఘటనల్లో మహిళల అదృశ్యంపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మద్యం విక్రేతల అరెస్ట్

మదనపల్లె : కర్ణాటక మద్యం అక్రమ రవాణా, విక్రయం కేసులో నిందితులుగా ఉంటూ పరారీలో ఉన్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రామసముద్రంకు చెందిన సుబ్రహ్మణ్యం, నాగరాజు, అనిల్ కర్ణాటక మద్యం కేసులో నిందితులుగా ఉన్నారన్నారు. కేసు నమోదు నుంచి పరారీలో ఉన్న వీరిని గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిస్తే న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారన్నారు. సమావేశంలో ఎస్ఐ అంజాద్‌బాషా, ఎస్ఈబీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేశ భద్రతలో సీఆర్‌పీఎఫ్ కీలక పాత్ర



సీఆర్‌పీఎఫ్ జవాన్‌ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఐజీ ఏవైవీ క్రిష్ణ

కలికిరి : దేశ భద్రతలో సీఆర్‌పీఎఫ్ కీలక పాత్ర పోషిస్తోందని సీఆర్‌పీఎఫ్ ఐజీ ఏవైవీ క్రిష్ణ అన్నారు. కలికిరి సీఆర్‌పీఎఫ్ (సీఐఏటీ-3) 10వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఉదయం ఆయన కేంద్రం ఆవరణలోని క్వార్టర్ గార్డ్‌ని పరిశీలించారు. నూతనంగా ఏర్పాటైన క్వార్టర్స్, అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. మధ్యాహ్నం సైనిక్ సమ్మేళన్ నిర్వహించి కేంద్రంలో జరుగుతున్న వివిధ రకాల శిక్షణ, వసతి, ఇంకా అవసరమైన సదుపాయాలపై సీఆర్‌పీఎఫ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జవాన్‌లతో ముఖాముఖి మాట్లాడారు. సాయంత్రం అన్నమయ్య జిల్లా ఎస్పీ బి.క్రిష్ణారావు సీఆర్‌పీఎఫ్ కేంద్రానికి చేరుకుని ఐజీని కలిసి ఆవిర్భావ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలలో సీఆర్‌పీఎఫ్ కమాండెంట్‌లు నీరజ్‌కుమార్ పాండే, రాజేష్‌కుమార్, డిప్యూటీ కమాండెంట్‌లు సంజీవ్‌కుమార్ ఓరా, శివప్రసాద్ కేజీ, ప్రసాద్, అమరనాథ్, అసిస్టెంట్ కమాండెంట్‌లు శివస్వామి, హనుమంతరావు పాల్గొన్నారు.